"దిసీజ్ సూటబుల్ ఫర్ యు"

"ఎస్, సార్" అన్నది రేవతి చిరునవ్వుతో. లోలోపల నుంచి గందరగోళం రేగుతోంది.

ఇది నాకు సూటబుల్ జాబా? నువ్విచ్చే వెయ్యి రూపాయల కోసం ఎంతమంది వెధవలకోసం నవ్వాల్లా నేను ఎన్నిసార్లు 'ఎస్ సార్', 'థాంక్స్ సార్' అని అబద్ధాలు చెప్పాలి. నేను చేయని తప్పకు 'సారీ సార్' అని ఎంత అణకువ చూపించాలి. నథింగ్ డూయింగ్...నువ్వు చెప్పినట్లు చేయను గాక చేయను.

రేవతి ఫైల్ చేతిలోకి తీసుకుంది.

"రేపు మార్నింగ్ సెవెన్‌కే ఎంటెండ్ అవుతాను సార్. ఆ విషయం నాకు వదిలేయండి. వాళ్ళని రిసీవ్ చేసుకుని హోటల్ 'వంశీ'కి డైరెక్ట్ చేయాలి. అంతేకదా!"

"అంతే కదా అనుకోకు! ఇది మనకు చాలా ముఖ్యం. నువ్వు వాళ్ళనెలా ఇంప్రెస్ చేస్తావో నాకు తెలియదు. రేపు సిట్టింగ్‌లో వాళ్ళు మన ప్రపోజల్‌కి నో అనకూడదు."

రేవతి మళ్ళీ నవ్వింది.

"ఓకే సార్! ఐ కెన్ డూ మై బెస్ట్"

మళ్ళీ లోలోపల నుంచి గందరగోళం...

"ఎలా ఇంప్రెస్ చేస్తానా, వాడి పక్కలో పడుకుంటానా రాస్కెల్. మొహానికి పూసుకుంటే వున్న అందం పోయి నల్లమచ్చలొచ్చేసే ప్రోడక్టును మార్కెట్‌లోకి వదిలావు. మినప్పిండి మరపట్టించి ఫేస్‌పాక్‌ని చేసావు. వచ్చేవాళ్ళు నెత్తిన అదంతా రద్దితే నీకు లక్షలొస్తాయి. మధ్యలో నాకే మిట్టా ఈ ఇంప్రెస్ చేసే శిక్ష..."

"అన్నట్లు ఆ అడ్వర్‌టైజ్‌మెంట్ ఆఫీసర్‌కి ఫోన్ చెయ్యి. ఉదయం కలుస్తానన్నాడు."

"ఎస్ సార్. ఒక్క నిమిషంలో కాంటాక్టు చేస్తాను" రేవతి నవ్వు మొహంతో పొందికగా నడిచివచ్చి సీట్లో కూర్చుంది. నడకలో విసుగు, విసురు వుంటే అద్దంలోంచి వాడు కనిపెట్టేస్తాడు.

ఫోన్ తీసి మళ్ళీ అదే గొంతుతో "దిసీజ్ రాప్స్ అండ్ రాప్స్ కంపెనీ. రేవతీ స్పీకింగ్. కృష్ణన్ ఉన్నారా?"

"ఓ మేడమ్ రేవతి! వాటే గుడ్ డే! నీ గురించే అనుకుంటున్నాను. మీరు ఫోన్ చేసారు. చెప్పండి. వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ"

యాడ్ డమ్మీ చూపించే నెపంతో తన చేయి మీద వేసిన వాడి చేయి గుర్తువచ్చింది రేవతికి. ఆ వెంట్రుకలున్న మొరటు చేయి తన భుజం తాకటం, పొరపాట్న తగిలినట్లు మోచేత్తో రొమ్ములు తాకటం–మళ్ళీ మనసులో అలజడి. "నాకు బాడ్ డే. నీతో మాట్లాడటమే ఎలర్జీగా వుంటే పైగా నీ సాయం ఒకటి కావాలా నాకు..."

"అదే మిష్టర్ శంకర్ మీ కోసం అడిగారు. అవును. ఈ రోజు మా యాడ్ వస్తోందా? ఆయన మీతో మాట్లాడతారు. ఒక్క నిమిషం ఉండండీ..."

"ఉండు...ఉండు. ఆయనతో నేను మాట్లాడతాలేకానీ, ఏమిటి కబుర్లు...సాయంత్రం ఏమిటి నీ ప్రోగ్రాం..."

"ఏముందీ...రొటీన్... ఇంటికి పోవటం, వండుకోవటం, తిని చదువుకుంటూ పడుకోవటం..."

"అబ్బ! ఎంత కలర్‌ఫుల్ లైఫ్. టెన్షన్స్ లేకుండా చదువుకుంటూ..."

మళ్ళీ రేవతి నవ్వింది.

"సాయంత్రం ప్లూటిస్ట్ చౌరాసియా ప్రోగ్రాం వుంది. నాకు వి.ఐ.పి. పాస్ వచ్చింది. మీకు ఇంటరెస్ట్ ఉందా..."

మనసు ఒక్క నిమిషం గాల్లో తేలింది. వేణుగానంలో తేలిపోదాం అన్న ఫీలింగ్ వచ్చింది. కానీ పక్కనే కృష్ణన్‌గాడు వాడి బొచ్చు చెయ్యి... అంతకంటే కిరోసిన్ కంపు కొడుతున్న రూమ్‌లో వంటొండుకోవటం బెటర్.

"సారీసర్...నాకు ఆఫీస్ వర్కు వుంది. సార్ నన్ను వేరే చోటికి వెళ్ళి రమ్మన్నారు. ఉండండి సార్‌తో మాట్లాడండి..." మరో మాటకు అవకాశం ఇవ్వకుండా కనెక్షన్ ఇచ్చేసింది రేవతి.

క్షణం తీరికలేకుండా వరదలా ఫోన్లు... అవును సార్... ఎస్ సర్... నో సర్...

"మేడమ్ ఇది రాప్స్ అండ్ రాప్స్...కదా. మీ "స్వీట్ సిక్స్‌టీన్ 'ఫేషియల్ గురించి. బస్టాండ్‌లో టి. వి.లో చూసానండి. అప్పటి నుంచి వాడుతున్నా. మొహంలో స్మూత్‌నెస్ ఏదీ కనపడలేదండీ..."

రేవతి రాబోయిన నవ్వు ఆపుకుంటూ–

"ఎలా వాడుతున్నారు మేడమ్. వారానికి ఒకసారా? అబ్బెబ్బే. అలా కాదండి. బెటర్ రిజల్ట్స్ కోసం రోజుకి ఒక్కసారి ఫేస్ పాక్ వేసుకోండి..."

"ఫరవాలేదంటారా?" ఆశా నిరాశల మధ్య ఊగిసలాడే గొంతు.

మళ్ళీ నవ్వేసింది రేవతి. ఈవిడ ప్రతిపూటా ఈ మినప్పిండి పట్టించుకొని అందంగా అయిపోతానని ఊహించటం...

"నో ప్లాబ్లమ్ మేడమ్. మేం హామీ ఇస్తాం."

రేవతి మళ్ళీ ఎం.డి.కి కనెక్షన్ ఇచ్చి "సార్! మన యాడ్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది సార్. ఉదయం నుంచి చాలా ఫోన్ కాల్స్ వచ్చాయి."

"అబద్ధం ఒక్కటంటే ఒక్కటి ఎవరో పిచ్చి పీనుగు..." మనసు నోరు నొక్కింది రేవతి.

ఎం.డి. ఆనందపు నవ్వు నవ్వాడు. జనాన్ని పిచ్చి వెధవలను చేశాను కదా అనే నవ్వు. ఎదుటివాడి అమాయకత్వం మనకి డబ్బు రూపంలో ఉపయోగపడుతోంది కదా అని నవ్వు.

"యు ఆర్ సో ఎఫిషియంట్ రేవతి. యువర్ ఫేస్ ఈజ్ సూటబుల్ ఫర్ అవర్ ప్రోడక్ట్"

"థ్యాంక్యూ సార్"

ఆ రోజు ఆ యాడ్ తీసేటప్పుడు ఆ ఫేస్‌పాక్ పూసుకున్నాక అట్లపిండి మొహం మీద అతుక్కుపోయిన ఫీలింగ్. అది కడిగేయగానే వచ్చిన ఆపుకోలేని నవ్వు ఆ యాడ్‌కి లైఫ్. అట్లపిండి గుర్తురావటం, వెంటనే నవ్వు రావటం, నవ్వు ఆపుకోలేక బుగ్గలు, చెవులు ఎర్రబడిపోయి యాడ్ బ్రహ్మాండంగా వచ్చింది. ఇది స్వీట్ సిక్స్‌టీన్ ప్రభావం" అని యాడ్‌లో తను కులికిన కులుకు, కనురెప్పలార్చుతూ వళ్ళంతా కదిలిస్తూ జనంమీద వేసిన సమ్మోహనాస్త్రం. మొహం మీద రాసుకునే సుద్దకి వళ్ళంతా వణికిస్తూ భుజాలు పొట్ట చూపించటం ఎందుకురా చెవల వెధవా అని ఒక్కరూ అడగరేం? మొహం మీద నవ్వు కరిగిపోయేంత ఉక్రోషం వచ్చిన సమయంలో సూర్యకళ లైన్లోకొచ్చింది.

"ఒసే రేవతీ! నా ఉద్యోగం పోయిందే" అంది రొప్పుతుంటూ.

రేవతి గుండె జల్లుమంది.

"ఎందుకే?" అంది ఆదుర్దాగా.

"నా మొహం ఉద్యోగం. ఎవరో కంప్లయింట్ ఇచ్చాడు"

"ఏవిట్టా విషయం?"

ఇరవై తొమ్మిదో ఛానల్‌లో మీకు వచ్చే ప్రోగ్రామ్ ఏమిటి? అన్న సర్వే కంట్రాక్ట్ ఒకటి మా మేనేజర్ తీసుకున్నాడు. ఒక్కొక్కళ్ళకి వెయ్యి కాల్స్, రోజుకు ముప్పయి రూపాయలు. రోజుకి వెయ్యి ఇళ్ళు తిరిగి పకడ్బందీగా ఇంటర్వ్యూ చేయటం సాధ్యమా? ఊరికే పేర్లు వ్రాసుకొని ఛానల్ చూస్తున్నారా లేదా అని అడిగి మిగతావన్నీ పాజిటివ్ సమాధానాలు టిక్కులు పెట్టటం–అవన్నీ సబ్మిట్ చేశాం కదా. ఎవడో ఒకడు ఫోన్ కొట్టాడు డీటైల్స్ సరిగ్గా అడగలేదని."

"ఎవడే వాడు"

అప్సరా ఎపార్ట్‌మెంట్సులో జండా కొయ్యగాడొకడు తగిలాడు. మనం ప్రశ్నలడిగితే వాడు నటించి చూపెడతాడు. కూల్‌డ్రింక్ త్రాగమన్నాడు. సరదాగా మూవీ చూద్దాం. కాసేపు రండి అని ఆహ్వానించాడు. ఎక్కడ ఛస్తాం. నీ పని చూసుకో బాబూ అని వాడిని ఏం అడగకుండా వచ్చేశా. వాడు తీరిగ్గా ఫోన్ చేసి..."మీ డబ్బు అని ఆడాళ్ళంతా ఎక్కడో వీధి అరుగుల మీద కూర్చుని టిక్కులు పెట్టుకుంటున్నారు. సర్వే లేదు పాడూ లేదు అని చెప్పాట్ట. మేనేజరు తిట్లు"

"మేనేజరేమిటి కొత్తగా...చంద్రం కాదా?"

"ఇప్పుడు చంద్రం కాదే అతను ప్రమోషన్ మీద వైజాగ్ వెళుతున్న స్పెషల్ ఆఫీసర్. ఇన్నాళ్ళ స్నేహానికి సారీ చెప్పి, తనకు కెరీర్ ముఖ్యం అన్నాడు. బిగినర్ అట తను. ఇప్పుడీ వయసులో అమ్మాయిల స్నేహంతో కెరీర్ పాడుచేసుకుంటే ఫ్యూచర్ ఉండదట.

రేవతి పళ్ళు కొరుక్కుంది. "మరి ఇన్నాళ్ళనుంచి ఏవయిందిట ఆ జ్ఞానం నీతో షికార్లు కొట్టినప్పుడు రూమ్‌కి రమ్మన్నప్పుడు కెరీర్ గుర్తు రాలేదా?"

"మనకి ఉక్రోషాలు కుదరవే బాబూ. నమ్మటం తప్పకదా! చనువివ్వటం తప్ప

కదా? ఎండి. ముందు పిలిచి ఢదామడా తిట్టి ఉద్యోగంలోంచి తీసేసాడు. తరువాత బుద్ధిగా వుంటే పనిచేసుకోవచ్చునని అభిమానం చూపించి విషయం చెప్పేసాడు. నన్ను మనసు రాయి చేసుకోమన్నాడు."

"ఇప్పుడెలాగే...."

"ఎలాగేమిటి నేనింటికి పోతున్నా. నువ్వు కూడా పెందరాళే రా." ఫోన్ పెట్టేసింది సూర్యకళ.

ఉసూరుమంది రేవతి.

ఎదురుగా అద్దాల్లోంచి రివాల్వింగ్ ఛెయిర్‌లో వెనక్కి వాలి అటు ఇటు కదులుతూ మాట్లాడుతున్న ఎం.డి. శంకర్ కనిపిస్తున్నాడు. ఎంత ఆనందం, ఎంత నిశ్చింత ఆ మొహంలో. ఆ కూర్చోవటంలో ఎంత దర్జా. ఆ మొహంలో ఏ గొప్పా కనిపించదు. వెయ్యి మందిలో ఒక మామూలు ప్రత్యేకతలేని ముఖం. కానీ ఆ కళ్ళల్లో ఇతరులని శాసించగలిగే అధికారం. డబ్బుకి ఇంత శక్తి ఎలా వుందో...

రేవతి వణికింది.

మళ్ళీ ఫోను మోగింది. "లుక్ రేవతి! లంచ్ తీసుకున్నాక నువ్వు కిశోర్‌కి హెల్పు చెయ్యి. నీ ప్లేస్‌లోకి ఉమని రమ్మను."

రేవతి పళ్ళు కొరుక్కుంది.

ఎకౌంట్సు చెక్ చేసేందుకు కిషోర్ వస్తాడు. ఆ వేళకి తను అక్కడ వుంటే కిషోర్ గంటల తరబడి ఉండిపోతాడు. ఉమ పెద్దావిడ. ఆవిడతో కిషోర్ ఎంతసేపు మాట్లాడతాడు. వాడు పని ఎగ్గొట్టకుండా చేసే ఎత్తు ఇది. వాడికి కబుర్లు చెప్పి పని చేయించి...అదీ ప్లాను. ఓరి నీ బుర్ర వక్కలైపోనూ...

లంచ్ బాక్సు తీసి చల్లారిపోయిన అన్నం, బీరకాయ కూర చచ్చినట్లు తిని మొహం కడుక్కుని మళ్ళీ కొత్త నాటకానికి వేషం వేసుకుని,

"హల్లో! కిషోర్"

"ఓ రేవతి...వాటే సర్‌ప్రయిజ్. నీతో కలిసి పనిచేయవలసి వస్తోందని తెలిస్తే ఉదయమే హాజరైపోయే వాడిని. లెటజ్ సెలబ్రేట్ విత్ కాఫీ."

"ఓ.కె. థాంక్స్. ఇప్పుడే హెవీగా లంచ్ తీసుకున్నా"

"అరె నేను మిస్సయ్యానన్నమాట. నాకు తెలియక అడుగుతా ఇంత నాజూగ్గా ఉండటానికి ఏం తీసుకుంటారు మేడమ్ ఓన్లీ జ్యూస్..."

'నా జన్మకి ఎరుగను...' అనబోయి మళ్ళీ అదే నవ్వు.

కళ్ళు మాటి మాటికి గడియారం వైపుకు పరుగెడుతుంటే ఎప్పుడయిపోతుందా ఈ లెక్కల వర్క్ అని మనసు క్షోభ పెడుతుంటే 'విత్ ప్లెజర్'...'ఓ ఐసీ' అనటం ఎంత కష్టం... ఎంత కష్టం...

* * *

రూం తాళం తీసే వుంది. అమ్మయ్య సూర్యం వచ్చేసింది అనుకుంది రేవతి.

కనీసం లైటన్నా వేసుకోకుండా మంచం మీద అడ్డంగా పడుకుని వుంది సూర్యకళ.

'ఏవిటే సూరిపండు. అంతా గందరగోళంగా వుంది. చంద్రం అలా మాట్లాడటమేమిటి?"

సూర్యకళ విసురుగా లేచి కూర్చుంది.

జుట్టు చిందర వందరై కళ్ళు ఎర్రబారిపోయి ఏదో కొత్త మనిషిలా వుంది సూర్యకళ.

'నిన్నిలా వదిలేసి వెళ్ళిపోవటం ఏవిటే' అన్నది రేవతి.

పెద్దగా నవ్వింది సూర్యకళ. రేవతి బిక్కచచ్చిచూస్తూ ఉండిపోయింది. సూర్యం మంచంమ్మీద లేచి కూర్చుంది.

జుట్టు చిందరవందరై కళ్ళు ఎర్రబారిపోయి ఏదో కొత్త మనిషిలా ఉంది సూర్యకళ.

'నిన్నిలా వదిలేసి వెళ్ళిపోవటం ఏవిటే' అన్నది రేవతి.

పెద్దగా నవ్వింది సూర్యకళ. రేవతి బిక్కచచ్చి చూస్తూ ఉండిపోయింది. సూర్యం మంచంమ్మీద లేచి కూర్చుంది. కళ్ళు గట్టిగా తుడుచుకుని చెదిరిపోయిన జుట్టుని రబ్బర్ బ్యాండ్‌తో సరిచేసుకుంది.

'నీకో కథ చెప్పనా రేవతీ' అన్నది. రేవతి సమాధానం ఇచ్చేలోగానే...

"ఓ పురుగుంది రేవతీ! ఈ సృష్టిలో సకల చరాచర జీవులకి ఓ జీవిత క్రమం ఉంది. ఈ పని ఇలా చేయాలి, ఇలా ఉండాలి, ఇలా బ్రతకాలి అని రూల్సున్నాయి. ఈ పురుక్కి ఇలాంటి బోర్డర్ బ్రతుకు ఇష్టం లేదు. దానికి నిర్దేశించిన ప్రదేశంలో ఎప్పుడూ శరీరం ఈడుస్తూ పాకుతూ బ్రతకటం కంటే పక్కన విశాలమైన రహదారిలో చకచకా నడిచిపోయే కాళ్ళపైన మనసు. ఆ దారంట నడిచే వేలవేల కాళ్ళల్లో ఓ జతకు ఈ పురుగు కంటపడింది. ఆశ్చర్యంగా, ఆనందంగా, ఆశగా, ఆ రహదారి వైపు చూసే ఆ పురుగు కళ్ళల్లో మెరుపుకి ఆనందించి ఆ కాళ్ళుగల ఆసామి ఆ పురుగుని చేతిలోకి తీసుకున్నాడు. అక్కడ ఆ పురుగుకి ఆ చేతుల వెచ్చదనం, ఆ బలం, ఆవేశం ఎంతగానో వచ్చాయి. అలాగే ఆ బలహీనమైన పురుగుకి ఉన్న అందమైన భావాలు, కలలూ, వినటం ఆ పెద్దమనిషికి అంతులేని ఆనందం ఇచ్చాయి. అయితే ఎంతసేపని ఆ పురుగుతో కాలక్షేపం?

అంతంలో అతనికి మంచిపని దొరికింది. అతను వెంటనే పురుగుని నేలకు దింపాడు. నువ్విలా రాకమ్మ కాళ్ళ కిందపడి నలిగిపోతావు. నీతో కూర్చుంటే ఎల్లాగా, నాకు చాలా పని ఉంది నే వెళ్ళిపోతున్నా అన్నాడు.

ఆ పురుక్కు కోపం వచ్చింది. "ఇన్నాళ్ళుగా ఈ విషయం నాకు చెప్పలేదేం? నా రంగు రంగుల కలలకు ఎందుకు ఊతం ఇచ్చావు?" అంది.

అందుకు ఆ పెద్దమనిషి "అదేమిటి తీరిగ్గా ఉన్నాను కనక నీతో కబుర్లు చెప్పాను. నేనూ ఈ రహదారిపైన కొత్తగా నడవటం మొదలుపెట్టాను. ఇంకా ఎంతో దూరం నడిచి ఎంతో పని చేయవలసి వుంది. అప్పుడు నాకు అందమైన జీవితం దొరుకుతుంది. నీలాటి పురుగులతో, పిచ్చికలతో కూర్చుని కలలు కంటే ఎలా సరిపోతుందీ?" అని అతను నడవటం మొదలుపెట్టాడు. పిచ్చిపురుగుకి తాపత్రయం అతనితో నడవాలని అప్పటికీ అతను చెప్పాడు.

"నీ పురుగు జాతికి చెడ్డ పేరొస్తుంది. వెనక్కు వెళ్ళిపో" అని.

పురుగు వింటుందా "నీతో స్నేహం కట్టినప్పుడే నీ అరచేతిలో పొందికగా కూర్చున్నప్పుడే నేను నా జాతిని వదిలేశా. నీ జాతిలో కలుస్తా" అంది. అలా కుదరదని ఆ పెద్దమనిషి వెళ్ళిపోతుంటే పురుగు అడ్డా లడ్డాలు పడి అతని కాళ్ళ క్రింద పడిపోయింది. అతను పాపం నొచ్చుకొని ఆ నడ్డి విరిగిన పురుగుని జాగ్రత్తగా ఓ పక్కన పడుకోబెట్టి "ఇలా తొందరపడకు. కొంతకాలంలో నీకు నయమై పోతుంది. నీ తెలివితేటలతో, నీ ఉత్సాహంతో నీ జాతిలో గొప్పగా వెలిగిపోతావు. బీ కేర్‌ఫుల్" అనేసి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఆ నడ్డి విరిగిన పురుగు ముసుగులో ఉన్నానే చిలకా. కనపడని బాధ ఇది. అండర్ స్టాండ్" అన్నది సూర్యకళ.

రేవతి ఏడవబోతే వద్దని కోప్పడింది ఇద్దరు నిశ్శబ్దంగా కూర్చున్నారు.

'అస్తమానం ఉద్యోగం నవ్వు నవ్వుతాం కదా మన సొంతానికి నవ్వులెందుకు వుండవే సూర్యం అన్నది రేవతి.

"ఏమో..." అన్నది సూర్యం.